# టీనేజ్

పదవ తరగతి చివరి పరీక్షరాసి ఇంకా లత ఇంటికి రాలేదేమిటా అని కామాక్షమ్మ ఎదురుచూస్తూంది. స్నేహితురాళ్ళతో మాట్లాడుతూండి పోయిందేమో అని కొంతసేపు సరిపెట్టుకున్నా, గంటలు గడుస్తున్నకొద్దీ ఆమెలో ఆందోళన అధికమైంది. దగ్గరలో ఉన్న స్నేహితురాలు వనజ ఇంటికి పంపించింది కొడుకు గోపీని. లత అక్కడలేదు. ఆ అమ్మాయి తనకేమీ తెలియదంది.

ఇక లతకు కాస్త సన్నిహితంగా ఉండే రమ ఇల్లు దూరం. అయినా ఆటో తీసుకుని అక్కడికి బయలుదేరింది. లత తండ్రి రాజారావు ఊరికి వెళ్ళాడు. ఈ రాత్రికి ఆయన తిరిగి వస్తాడు. ఈ పిల్ల ఎటు పోయిందో, సమయానికి ఆయనా లేడే అన్న బాధ ఒక పక్కా, ఎంత రాద్ధాంతమై, అల్లరి అవుతుందో అన్న బాధ మరో పక్కా! లత ఏ గొడవా లేకుండా ఇల్లు చేరాలని ఆ తల్లి మనసు శతకోటి దేవతలకు మొక్కుకుంటూంది.

రమ కూడా తనకేం తెలియదంది. కానీ కామాక్షమ్మకి నమ్మ బుద్ధి కాలేదు. రమకు లత గురించి తెలుసేమో అనిపించింది. బాధను దిగమింగుతూ రమ రెండు చేతులూ పట్టుకుని అడిగింది. "లత ఎక్కడికి వెళ్ళిందో చెప్పమ్మా రమా!" అని.

"శేఖర్ అనే అబ్బాయితో యాదగిరిగుట్టకు వెళ్ళింది. ఎవరితోను చెప్పవద్దంది" అంది రమ భయం భయంగా.

ఇక ఆ అమ్మాయి చెప్పేదేది వినిపించకోలేదు కామాక్షమ్మ. ఆటోలో ఇంటికి వచ్చేసరికి భర్త రాజారావు వచ్చి ఉన్నాడు. ఆయన్ని చూడగానే కామాక్షమ్మలో దుఃఖం పొంగిపోయింది. విషయం విని ఆయన నిర్ఘాంతపోయాడు. బాధ, ఆవేశం, కోపం అన్నీ ప్రజ్వరిల్లినా సంబాళించుకుని టాక్సీ కోసం బజారులోకి వెళ్ళాడు రాజారావు!

* * *

యాదగిరిగుట్టలోనే వెతికి పట్టుకుని లతను ఇంటికి తీసుకువచ్చారు కామాక్షమ్మ, రాజారావు. ఒకరోజంతా అక్కడ అతనితో గడిపిన లతను కులం వేరన్న ఆలోచన పక్కకునెట్టి, లత జీవితాన్నీ, పరువునూ కాపాడాలంటే అతనితోనే పెళ్ళి జరిపించాలన్న నిశ్చయానికి వచ్చి 16 సంవత్సరాల శేఖర్‌ను ఒప్పించారు. అతనూ ఇంటర్ స్టూడెంట్. అతని తల్లితండ్రులను అంగీకరింపజేయడం కష్టమైనా రాజారావు బతిమాలగా వాళ్ళు అంగీకరించారు లతను కోడలిగా చేసుకోడానికి.

కానీ లత ఒప్పుకోలేదు. ఆమె శేఖర్‌ను ససేమిరా పెళ్ళి చేసుకోనంది.

"ఎందుకు చేసుకోవే! అంత ఇష్టం లేని దానివి వాడితో ఎందుకు వెళ్ళావ్?" అంది తీవ్రంగా కామాక్షమ్మ.

"నేను నా ఇష్టం వచ్చినట్లు పోతాను. పెళ్ళి చేసుకుందామని పోలేదు నేను"- అని అనడం, తల్లి చెంప చెళ్ళుమనిపించడం జరిగి పోయాయి.

లత మనస్తత్వాన్నెరిగిన రాజారావు లతను అనునయించి, "చెప్పమ్మా నువ్వు చేసింది తప్పుకాదూ!" అని ప్రశ్నించాడు. 15 వసంతాలైనా పూర్తికాని ఆ ముద్దమందారం వెక్కిళ్ళ మధ్య అంది. "పారిపోవడంలో థ్రిల్ ఉందనుకుని పోయాను. అంతే కానీ శేఖర్‌ను నేను ప్రేమించ లేదు పెళ్లి చేసుకోవాలనుకోనూలేదు. మీరు బలవంతంగా పెళ్లిచేస్తే చస్తాను" లత మాటలు ఆయనకి వినిపించడం లేదు.

ఆమె అమాయకత్వం, జీవితం పట్ల అవగాహన లేకపోవడం, తప్పుదారి పట్టించే సాహిత్యం చదవడం, అసభ్యకర చిత్రాలు చూడటం టీనేజ్ పిల్లల మీద ఎట్లాంటి దుష్ప్రభావాన్ని చూపుతాయో ఈ కాలం పిల్లలకు ప్రతీకలా ఉన్న లత పరిస్థితికి కుమిలిపోతూ, ఏం చెయ్యాలో తోచక జుట్టు పీక్కుంటూ బావురుమన్నాడు రాజారావు.

(ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 7-1-1987)